క్లుప్తంగా

రూ.కోటి బీమా వర్తింపజేయండి..



మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పాల్వంచ: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికులు విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు ఉద్యోగి మరణిస్తే శాలరీ అకౌంట్ ఉన్న వారికి రూ.కోటి బీమా వర్తింపజేయాలని టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జెన్‌కో కార్యదర్శి చారుగుండ్ల రమేష్ అన్నారు. మంగళవారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ మేనేజర్ రాజేంద్రప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సందుపట్ల శ్రీనివాసరెడ్డి, ధర్మపురి నాగేశ్వరరావు, ఎండీ.అమీన్, దెంచనాల రాంబాబు, ముత్యాల రాంబాబు, నారందాసు వెంకటేశ్వర్లు, రవికుమార్, సుభానీ, మహేందర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూమి కౌలుకు వేలంపాట

పాల్వంచరూరల్: పాతపాల్వంచలో వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన చింతల చెరువు ఆయకట్టు మగాణి భూమి 2.30 కుంటల సాగుభూమి కౌలుకు బుధవారం మధ్యాహ్నం ఆలయ ఆవరణలో బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు రూ.5వేలు డిపాజిట్ చెల్లించాలని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న జీఎం కృష్ణయ్య

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా కార్మికుల పిల్లలకు యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, కాకతీయ విశ్వవిద్యాలయం, కొత్తగూడెంలో బీటెక్ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏరియా జీఎం వీసం కృష్ణయ్య తెలిపారు. ఉద్యోగుల పిల్లలకు 10 సీట్లు కేటాయించినట్లు తెలిపారు. మైనింగ్ ఇంజనీరింగ్–2, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ –2, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ –2, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్– 2, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్–2 సీట్లు ఉన్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు జూలై 14 లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

టీచర్ పోస్టులకు రాత పరీక్ష

ఇల్లెందు: సింగరేణి స్కూలో అడ్‌హక్ ఉపాధ్యాయులుగా పని చేసేందుకు 13 పోస్టులు ఖాళీ ఉండగా మంగళవారం రాత పరీక్ష నిర్వహించారు. 49 మంది దరఖాస్తు చేసుకుని పరీక్ష రాశారు. ఈ నెల 29న డెమో క్లాసులు ఉంటాయని కరస్పాండెంట్ జి.సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, అకడమిక్ ఇన్‌చార్జ్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు రవీందర్, ధనలక్ష్మి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లను బాగు చేయండి..

- అవస్థలు పడుతున్న పల్లె ప్రజలు
- పట్టించుకోని అధికారులు



అధ్వానంగా మల్లారం రోడ్డు



ప్రమాదకరంగా మారిన మొండికట్ట - సారెకల్లు రోడ్డు

పాల్వంచరూరల్: ఈ మార్గంలో వెళ్లాలంటే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో అయితే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలోని మొండికట్ట నుంచి కారెగట్టు, సారెకల్లు ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. గ్రామంలో అయితే రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డుపై వేసి తారు లేచిపోయింది. రోడ్డు ప్రారంభంలో మొండికట్ట వద్ద అయితే రోడ్డుకు మధ్యలో కాలువను తవ్వి వదిలేశారు. ద్విచక్రవాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. పునుకుల వద్ద నుంచి సూర్య తండాకు వెళ్ల ప్రధాన రహదారి కిలోమీటర్ వరకు అధ్వానంగా ఉంది. కిన్నెరసాని కెనాల్‌పై చప్టాపై నుంచి రాకపోకలు సాగిస్తారు. చప్టా ఇరువైపుల ఇనుపరాడ్లు తేలి ప్రమాదకరంగా మారాయి. అయినా పట్టించుకునే నాథుడే లేడని ఆ గ్రామప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్ష్మీదేవిపల్లి నుంచి మల్లారం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి నాలుగు కిలోమీటర్లు ఉంటుంది. రోడ్డుపై కంకర తేలి, గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారిందని రాకపోకలు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి నిర్మాణం కోసం రెండుసార్లు నిధులు రూ.65లక్షల మంజూరైనా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో రోడ్డు నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. అదేవిధంగా లక్ష్మీదేవిపల్లి నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న నర్సింహాసాగర్ రహదారి కూడా రాకపోకలకు ప్రమాదాకరంగా మారింది. రోడ్డు నిర్మాణం కోసం గతంలో ఎంఆర్ఆర్ స్కీమ్ కింద రూ.22లక్షలు మంజూరు చేశారు. రెండుసార్లు టెండర్లు నిర్వహించారు. అయినా కాంట్రాక్టర్లు ముందుకురాని కారణంగా రోడ్డు అభివృద్ధికి నోచుకోవడం లేదు. వర్షాకాలం వస్తే రహదారిపై వరద నీరు ప్రవహిస్తాయి. అప్పుడు ఆ మార్గంలో ప్రయాణంచేయాలంటే భయమేస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుసార్లు ఈ రహదారిపై ద్విచక్రవాహదారులు ప్రమాదాలకు గురైన సందర్భాలు కూడా ఉన్నాయి.

ఇబ్బందిగా ఉంది..



ఉల్వనూరు, లక్ష్మీదేవిపల్లి నుంచి మల్లారం వరకు తారురోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ మార్గంలో రెండు లోలెవల్ చప్టాలు ఉన్నాయి. వర్షాకాలంలో వర్షం కురిస్తే వరద ఉధృతంగా ప్రవహించడం వలన రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది.

– పడిగె కోటేశ్వరరావు, మల్లారం

ఎవరూ పట్టించుకోవడం లేదు..



ఏజెన్సీ ప్రాంతంలో రోడ్ల అభివృద్ధిని ఎవరూ పట్టించుకోవడం లేదు. మల్లారం రహదారి, నర్సింహాసాగర్ రోడ్డుపై కంకర తేలి ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి రోడ్డును అభివృద్ధి చేసి ఇబ్బందులను తొలగించాలి.

– వర్సా నారాయణ, మల్లారం

ప్రతిపాదనలు పంపాం..

మల్లారం, నర్సింహాసాగర్, రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. టెండర్ల దశలో ఉంది. టెండర్ల ప్రక్రియ పూర్తికాగానే రోడ్డును నిర్మాణం చేస్తాం. అదేవిధంగా కారెగట్టు, పూసల తండా రోడ్లకు కూడా ప్రతిపాదనలు పంపించాము. నిధులు మంజూరు కాగానే వెంటనే ఆయా రహదారుల నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.

– శ్రీనివాస్, పంచాయతీరాజ్‌శాఖ ఏఈ

యోగాపై అవగాహన



ఇల్లెందురూరల్: యోగా చేస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు

జూలూరుపాడు: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇంటర్నేషనల్ యోగా డే సందర్భంగా మంగళవారం యోగాపై ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యోగా టీచర్ కవిత... యోగా చేయడం వల్ల ప్రాముఖ్యత, ఉపయోగాలు, ప్రయోజనాలను వివరించారు. యోగా గురించి గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించి, చైతన్య పరచాలని సూచించారు. మెడికల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ తేజశ్విని, యునాని డాక్టర్ రాజేందర్, ఆయుర్వేదిక్ డాక్టర్ శ్రీదేవి, సీహెచ్ఓ రామకృష్ణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సుదిమళ్లలో యోగా దినోత్సవం

ఇల్లెందురూరల్: జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలో రోజుకో గ్రామపంచాయతీ చొప్పున యోగా దినోత్సవం నిర్వహిస్తున్నారు. పంచాయతీ పరిధిలోని మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉద్యోగులు పంచాయతీ కార్యాలయంలో యోగా చేశారు. యోగా ప్రాముఖ్యతను తెలుసుకొని నిరంతర సాధన చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కల్తి పద్మ, మాజీ ఎంపీపీ మోకాళ్ల వెంకటమ్మ, పంచాయతీ కార్యదర్శి అజహర్, సిబ్బంది పాల్గొన్నారు.

సర్క్యులర్‌ను సవరించండి..



సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతిప్రతం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ఇటీవల యాజమాన్యం విడుదల చేసిన ట్రాన్స్‌ఫర్ పాలసీ సర్క్యులర్‌ను సవరించాలని సింగరేణి డైరెక్టర్(పా) వెంకటేశ్వర్లును సీఐటీయూ నాయకులు కోరారు. మంగళవారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు మాట్లాడుతూ... ఈ పాలసీలో కార్మికులు, ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, దీనిని వెంటనే సవరించాలన్నారు. ఈ సర్క్యులర్ రాజకీయ నాయకులు, పైరవీదారులకు ఊతం కలిగించేలా ఉందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని సీఐటీయూ యూనియన్ కొన్ని సవరణలు చేసిందన్నారు. అడ్మినిస్ట్రేషన్ ట్రాన్స్‌ఫర్‌లో ఇంటర్నల్, ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్‌లలో పదోన్నతులు పొందిన వారిని సీనియారిటీ ప్రకారం కోరిన చోటుకు బదిలీ చేయాలని, ఆ సందర్భంగా రిక్వెస్ట్ పెట్టుకున్న వారికి కూడా అవకాశం కల్పించాలన్నారు. డైరెక్ట్ ట్రాన్స్‌ఫర్ విషయంలో పేపర్ దరఖాస్తులను పక్కన పెట్టి, ఆన్‌లైన్ దరఖాస్తులను సీనియారిటీ ప్రకారంగా పరిశీలించి, సీనియర్లకు ప్రియారిటీ కల్పించాలని సూచించారు. ఐఈడీ లెక్కల ప్రకారం ఖాళీలను బట్టి ట్రాన్స్‌ఫర్ చేయాలని సూచించారు. మ్యూచ్‌వల్ ట్రాన్స్‌ఫర్‌ను అంగీకరించాలని సూచించారు. భార్యాభర్తలకు ఒకే ఏరియాలో పోస్టింగ్ కల్పించాలని, వీటిని యాజమాన్యం పరిశీలించాలని కోరగా.. డైరెక్టర్ అధికారులతో సంప్రదించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

మాజీ ఎమ్మెల్యే మృతిపై సంతాపం

జూలూరుపాడు: వైరా మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బానోత్ మదన్‌లాల్ గుండెపోటుతో మృతి చెందారు. ఈ మేరకు ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం ఈర్లపూడిలోని ఆయన స్వగృహంలో మృతదేహం వద్ద మండల నాయకులు పలువురు నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో యల్లంకి సత్యనారాయణ, లకావత్ గిరిబాబు, ఎద్లపల్లి వీరభద్రం, పీజీ.కృష్ణమూర్తి, మూడ్ చిట్టిబాబు, భూక్యా కళావతి, కొడెం సీతాకుమారి, చావా వెంకటరామారావు, సాయిన్ని శ్రీనివాసరావు, భూక్యా రాములు, లేళ్ల వెంకటరెడ్డి, మాలోత్ మంగీలాల్ నాయక్, యాసా నరేష్, గుండెపిన్ని వెంకటేశ్వర్లు, జాటోత్ కృష్ణ, బానోత్ ధర్మా, వల్లోజి రమేష్ ఉన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఇల్లెందు: మోటార్ రంగంలో పనిచేసే కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కె.సారంగపాణి, మోటార్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఎండీ రాసుద్దీన్ డిమాండ్ చేశారు. మంగళవారం ఇల్లెందులోని ఇఫ్టూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెండు మోటార్ కార్మిక సంఘాల విలీన సభలో వారు మాట్లాడారు. మోటార్ రంగంలో పని చేసే కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12 వేలు అందజేయాలని కోరారు. మోహన్‌రావు, శరత్, రాజులోథ్, అంజయ్య, కోటయ్య, రవి, నర్సయ్య పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే సొసైటీ పాలకవర్గ లక్ష్యం

పాల్వంచ: రైతుల శ్రేయస్సే ధ్యేయంగా పాల్వంచ సొసైటీ పాలకవర్గం కృషి చేస్తుందని సొసైటీ అధ్యక్షుడు, మాజీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ... జీలుగులు రూ.30 కిలోల బస్తా రూ.4,275 ఉండగా 50శాతం సబ్సిడీతో రూ.2,137లకు రైతులకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా సొసైటీ ఆధ్వర్యంలో ఎంఆర్‌పీకే ఎరువులు, రుణాల పంపిణీ, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏఓ పి.శంభోశంకర్, సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్, డైరెక్టర్లు బుడగం రామ్మోహన్‌రావు, కనగాల నారాయణరావు, పాపారావు, వెంకటేశ్వరరావు, కిషన్, బర్ల వెంకటరమణ, ఏఈఓలు సుజాత పాల్గొన్నారు.

చర్యలు తీసుకోండి..

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయంలోకి మద్యం సేవించి విధులకు వస్తున్న అటెండర్ మల్లయ్యపై చర్యలు తీసుకోవాలని మంగళవారం ఆలయ ఈఓ కార్యాలయంలో గంధం నర్సింహారావు, రమేష్ వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ గతంలో కూడా మద్యం సేవించి హాజరైతే మందలించడం జరిగిందని అయినా మార్పు రాలేదని పేర్కొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఏడీఏ లాల్‌చంద్

ఇల్లెందురూరల్: విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాల నిర్వహణలో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ లాల్‌చంద్ అన్నారు. సుదిమళ్ల రైతువేదికలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల విక్రయదారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ వ్యాపారి విత్తనాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. మార్కెట్‌లోకి నకిలీ విత్తనాలు వస్తే వెంటనే తమకు సమచారమివ్వాల్సిన బాధ్యత స్థానిక వ్యాపారులపై ఉంటుందన్నారు. దుకాణం వద్ద స్టాక్‌బోర్డు పెట్టాలని, రైతు రిజిష్టర్, స్టాక్ రిజిష్టర్, బిల్‌బుక్ విధిగా కనిపించాలని సూచించారు. అనుమతి లేని విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏఓ సతీష్, ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు నాళ్ల సోమసుందర్, వ్యాపారులు పాల్గొన్నారు.

సామాజిక చైతన్యం కల్పించాలి..



మాట్లాడుతున్న డీఎస్పీ సతీష్‌కుమార్

పాల్వంచరూరల్: విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందిస్తూనే వారిలో సామాజిక చైతన్యం కలిగించే విధంగా ఉపాధ్యాయులు చూడాలని పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్, డీఈఓ వెంకటేశ్వరచారి అన్నారు. పాతపాల్వంచలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న బయోలాజికల్ సైన్స్ టీచర్ల రెండో స్పెల్ ఐదోరోజు శిక్షణ తరగతులకు మంగళవారం డీఈఓ, డీఎస్పీలు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. మారుతున్న టెక్నాలజీని ఉపయోగించుకుని బోధనలో నూతన పద్ధతులను అవలంబించాలని సూచించారు. పోక్సో, మానవ అక్రమ రవాణా, డ్రగ్స్ వినియోగం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అనంతరం డీఎస్పీ, డీఈఓలను ఉపాధ్యాయులు సత్కరించారు. కోర్సు డైరెక్టర్ పద్మలత, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు కవిరత్న, సురేష్‌బాబు, ఎడారి ప్రకాశ్, పరమయ్య, జయబాబు, కమలాకర్ పాల్గొన్నారు.

సాటి మనిషికి సాయపడండి..

సమాజంలో సాటి మనిషికి సహాయ పడేలా జీవనం సాగించాలని డీఎస్పీ సతీష్‌కుమార్ రౌడీ షీటర్లకు సూచించారు. కిన్నెరసానిలోని రూరల్ పోలీసుస్టేషన్‌ను మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడారు.. కార్యక్రమంలో సీఐ, ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

రోస్టర్ రిజిష్టర్ల తనిఖీ



తనిఖీ చేస్తున్న బృందం సభ్యులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ రోస్టర్ రిజిష్టర్లను ఎస్టీ లైజన్ ఆఫీసర్ల బృందం మంగళవారం తనిఖీ చేశారు. సింగరేణిలోని ఎస్టీ అధికారుల పదోన్నతులకు సంబంధించిన రూల్ ఆఫ్ రిజర్వేషన్ రోస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ సెల్ ఇన్‌చార్జ్ ఏజే మురళీధర్‌రావు మాట్లాడుతూ... సింగరేణిలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పారదర్శకంగా నిర్వహిస్తున్నామని ఎలాంటి అవతవకలు లేకుండా వారికి రావాల్సిన పదోన్నతులు కల్పిస్తున్నామన్నారు. రోస్టర్ రిజిష్టర్లను పరిశీలించిన బృందం సంతృప్తి చెందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ ఉద్యోగుల చీఫ్ లైజన్ ఆఫీసర్, ఇల్లెందు ఏరియా జీఎం వీసం కృష్ణయ్య, ఈఈ సెల్ ఇన్‌చార్జ్ మురళీధర్‌రావు, అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏ.భాస్కర్‌రావు, సెక్రటరీ బి.నాగేశ్వరరావు, రామ్‌బాబు, కమిటీ సభ్యులు హతీరామ్, డి.పంతులు, బి.రాంబాబు, పర్సనల్ మేనేజర్ ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి..



మాట్లాడుతున్న విశ్వనాథం

పాల్వంచరూరల్: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని, ప్రతీ పంచాయతీలో పార్టీకి ప్రాతినిధ్యం వహించే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల విశ్వనాథం కోరారు. దంతలబోరు గ్రామంలో మంగళవారం సీపీఐ శాఖ మహాసభ ఎల్లంకి శివరావు అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ... నిరంతరం సమరశీల పోరాటాలు సాగిస్తున్న సీపీఐ ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో పరిమితమైంది కాదన్నారు. ప్రజలకు సేవలు అందించడానికి పురుడుపోసుకున్న పార్టీకి ప్రతినిధులుగా పనిచేయడానికి అదృష్టంగా భావిస్తారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ పటిష్టతకు ఎమ్మెల్యే కూనంనేని శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఇట్టి వెంకట్రావ్, గిరి, పి.వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, నారాయణ పాల్గొన్నారు. అనంతరం సీపీఐ శాఖ నూతన కమిటీ గ్రామ కార్యదర్శిగా పోలుబోయిన వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శిగా అంచ శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్ కార్యదర్శి పి.నాగరాజు, అధ్యక్షుడిగా కళ్యాణ్‌రామ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రాష్ట్ర ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లు పరిశీలన

సింగరేణి(కొత్తగూడెం): జూన్ 2న కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లను మంగళవారం కార్పొరేట్ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ సీఎస్సార్) జీవీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ... ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ హాజరు కానున్న నేపథ్యంలో అన్నిరకాల ఏర్పాట్లు చేయాలని, వేడుకలకు హాజరయ్యే ఉత్తమ కార్మికులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఇతరత్రా కార్యక్రమాలు నిర్వహించే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నెహ్రూ స్ఫూర్తితో ప్రజాపాలన



చుంచుపల్లి: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చుంచుపల్లి: భారతదేశ తొలి ప్రధానిగా, రాజనీతిజ్ఞుడిగా దేశాభివృద్ధికి పునాది వేసిన దార్శనికుడు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అని కాంగ్రెస్ నాయకులు అన్నారు. చాచా నెహ్రూ వర్ధంతి సందర్భంగా మంగళవారం విద్యానగర్‌లోని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. బ్రిటిష్ నుంచి విముక్తి పొందిన భారతదేశానికి తొలి ప్రధానిగా అన్నిరంగాల్లో ప్రగతి సాధించేలా పాలన కొనసాగించారన్నారు. నేటి బాలలే రేపటి భవిష్యత్ అని నమ్మిన నెహ్రూను చిన్నారులంతా ముద్దుగా చాచా నెహ్రూ అని సంబోధిస్తారని, ఆ మహనీయుని స్ఫూర్తితో తెలంగాణలో ప్రజాపాలన కొనసాగుతోందన్నారు. చీకటి కార్తీక్, బోదాసు కనకరాజు, గౌస్ పాషా, బాలశెట్టి సుందర్ రాజ్, తలుగు అనిల్, బాలపాసి పాల్గొన్నారు.

సుజాతనగర్: దేశానికి నెహ్రూ కుటుంబం సేవ చేస్తోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింతలపూడి రాజశేఖర్ అన్నారు. భారతదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ... నెహ్రూ భారత రాజ్యాంగంలో ప్రజలకు ఎన్నో హక్కులు కల్పించడానికి కృషి చేశారన్నారు. ఎస్కే అబిద్, మడిపల్లి శ్రీనివాసులు, గద్దం లక్ష్మణరావు, భద్రయ్య పాల్గొన్నారు.

ప్రమాదకరంగా అసంపూర్తి నిర్మాణాలు

- రూ.10 కోట్ల వ్యయం.. తొమ్మిది నెలలుగా నిర్మాణం
- నత్తతో పోటీ పడుతున్న రోడ్డు విస్తరణ పనులు
- రోడ్డెక్కుతున్న మురుగు.. ఇళ్ల ముందు దుర్గంధం



కల్వర్టు నిర్మాణం లేని అంతర్గత రహదారి



రోడ్డు మీదకు చేరుతున్న మురుగు

ఇల్లెందురూరల్: రూ.పది కోట్ల వ్యయంతో తొమ్మిది నెలల క్రితం ప్రారంభమైన పనులు నత్త నడకన సాగుతున్నాయి. పనుల ప్రారంభంలో రహదారి వెడల్పు నిర్ధారణపై అభ్యంతరాలు, ప్రజల నుంచి వెల్లువెత్తిన నిరసనల కారణంగా పనులు నిదానంగా సాగాయి. ఆ తరువాత వేగంగా సాగిన పనులు మూడు నెలలుగా పూర్తిగా నిలిచిపోయాయి.

ఎమ్మెల్యే చొరవతో కదలిక..

సుభాష్‌నగర్ కూడలి నుంచి లలితాపురం గ్రామం వరకు 1.2 కి.మీల పొడవున ప్రధాన రహదారి విస్తరణ, డివైడర్ నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు నాటి ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ చొరవతో ఎస్టీ ఎస్‌డీఎఫ్ పథకంలో భాగంగా రూ.10 కోట్ల నిధులు 2023 జూలైలో మంజూరయ్యాయి. శంకుస్థాపన చేశారు. నాటి నుంచి ముందుకు సాగని నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కోరం కనకయ్య చొరవతో సెప్టెంబర్‌లో పనులను ప్రారంభించారు.

అభ్యంతరాల నడుమ ప్రారంభమై..

రహదారి నిర్మాణ పనుల ప్రారంభ సమయంలో అధికారుల తీరు వివాదాస్పదమైంది. గతంలో రహదారి వెడల్పు పనులు జరిగిన సుభాష్‌నగర్ కూడలి నుంచే మళ్లీ పనులు ప్రారంభించడం విమర్శలకు తావిచ్చింది. అక్కడి నుంచి రోజుకో నిర్ణయంతో గందరగోళం నెలకొంది. ప్రజల నిరసనలతో ఆర్‌అండ్‌బీ అధికారులు అప్రమత్తమై రహదారి వెడల్పుపై ప్రజల అంగీకారం మేరకు నడుచుకోవడంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నిర్దేశించిన విస్తీర్ణంలో వెడల్పు పనులు పూర్తి చేసిన అధికారులు రహదారికి ఇరువైపులా కాల్వ పనులు ప్రారంభించారు. జనవరి వరకు వేగంగా సాగిన పనులు మార్చిలో ఒక్కసారిగా నిలిచిపోయాయి.

ప్రమాదకరంగా.. అసౌకర్యంగా..

రహదారికి ఇరువైపులా ప్రారంభించిన మురుగు కాల్వ నిర్మాణ పనులను అసంపూర్తిగా వదిలేశారు. అక్కడక్కడ మధ్యలోనే వదిలేయడంతో మురుగు నీటి ప్రవాహం ఎక్కడికక్కడి నిలిచిపోయింది. ఇళ్ల ముందు ముక్కుపుటలు అదిరేలా దుర్గంధం భరించలేకున్నామని ప్రజలు వాపోతున్నారు. ఇక ప్రధాన రహదారి నుంచి గల్లీరోడ్లకు అనుసంధానం చేసేలా కాలువలపై కల్వర్టులు నిర్మించకపోవడంతో ఆ మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రధాన రహదారి వెడల్పు పనులలో భాగంగా ప్రస్తుతం ఉన్న రహదారికి ఆనుకుని లోతుగా గుంతలు తవ్వి వదిలేశారు. ఆయా చోట్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

దుర్గంధం భరించలేకున్నాం...



మురుగుకాల్వ నిర్మాణ పనులు మధ్యలోనే వదిలేశారు. పైనుంచి వచ్చే మురుగు మా ఇంటి ముందే పేరుకుపోతోంది. దుర్గంధం భరించలేకున్నాం. నెలలు గడిచినా సమస్య పరిష్కారం కావడం లేదు. ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదు.

– పర్స తిరుపతమ్మ, సుభాష్‌నగర్

ఇబ్బంది పడుతున్నాం..



రహదారి వెడల్పు పనులు మూడు నెలలుగా స్తంభించాయి. ప్రారంభించిన పనులన్నీ ఎక్కడివి అక్కడే వదిలేశారు. మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. వెడల్పు పనులు అసంపూర్తిగా వదిలేయడంతో వర్షం నీరు చేరి చెరువును తలపిస్తోంది.

– గద్దం యశోధ, సుభాష్‌నగర్

పనులు ప్రారంభిస్తాం.

రహదారి విస్తరణ పనులను వెంటనే ప్రారంభిస్తాం. అసంపూర్తి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయిస్తాం. ప్రజలకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. విద్యుత్ స్తంభాలకు సంబంధించి అనుమతుల జాప్యం కారణంగా పనుల పురోగతిలో ఆలస్యం జరుగుతోంది. సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటున్నాం.

– మోతీలాల్, ఏఈ, ఆర్‌అండ్‌బీ, ఇల్లెందు

మహిళల రక్షణపై అవగాహన

పాల్వంచరూరల్: లక్ష్మీదేవిపల్లి గ్రామపంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న కూలీలకు మంగళవారం పని ప్రదేశంలో మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, వివక్ష, రక్షణ చర్యలపై జిల్లా కోఆర్డినేటర్ సంతోష్, రూప అవగాహన కల్పించారు. పని ప్రదేశంలో మహిళలకు ఏమైనా సమస్యలు వస్తే వెంటనే 108, 1098 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేస్తే వెంటనే సహాయం అందుతుందన్నారు. మహిళలు, ఆడపిల్లలు, దివ్యాంగుల భద్రత, సాధికారత సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వంశీకృష్ణ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.